# కాంగ్రెసుకూ తప్పని నక్సలిజం ముద్ర

నక్సలిజం బూచి కాదు గానీ దానినొక బూచిగా వాడుకోవడం మన పాలకులకు అలవాటే. మామూలుగా నక్సలైట్ ఉద్యమ ప్రభావం ఉన్న ప్రాంతాలలో ప్రజలను బెదరగొట్టడానికి ఆ బూచిని ప్రయోగిస్తుంటారు. అక్కడ ఏ విషయాన్ని గురించి ప్రజలు కొంచెం ఆందోళన చేసినా 'దీని వెనుక నక్సలైట్లు వున్నారు' అంటూ బెదిరించి ప్రజల నోళ్ళు మూయిస్తుంటారు.

ఇది పాత సంగతే. కానీ ఆ బూచిని కాంగ్రెస్ పార్టీ మీద కూడ చంద్రబాబు ప్రయోగించడం కొత్త విషయం. అయితే దీనిని అతని తెలివితేటలకు సంకేతంగా కాక అతని విద్యుత్ సంస్కరణల దివాలాకోరుతనానికి చిహ్నంగా గుర్తించడం ఉచితంగా ఉంటుంది. ఏ ప్రశ్నకూ జవాబు లేని చంద్రబాబుకు 'మీరు తీవ్రవాదులతో చేతులు కలుపుతున్నారు' అనేది అన్ని ప్రశ్నలకూ జవాబు అయింది.

కలిపితే కలుపుతారు. 'తీవ్రవాదం' అని పిలవబడేది ఒక రాజకీయ పంథా కాబట్టి ఆ పంథాను అనుసరించే వారితో రాజకీయంగా సఖ్యత కలిగి ఉండడం నేరమేమీ కాదు. దాని పట్ల రాజకీయంగా అభ్యంతరముంటే ఉండవచ్చు. నిజానికి ఈ అభ్యంతరం రెండు వైపులా ఉండవచ్చు. నక్సలైట్లతో రాజకీయ సఖ్యత ఎంత పరిమిత పరిధిలోనయినా మంచిది కాదని కాంగ్రెస్ వారిలో కొందరు అనుకోవచ్చు. కాంగ్రెస్ తో సఖ్యత ఎంత పరిమిత పరిధిలోనయినా తమకు తగినది కాదని నక్సలైట్లలో కొందరు అనుకోవచ్చు. అదొక రాజకీయ అభిప్రాయం. అయితే చంద్రబాబు ఆ బూచిని ప్రయోగిస్తున్నది ఆ అర్థంలో కాదు. 'తీవ్రవాదుల'తో చేతులు కలపడం అసాంఘికమైన నేరమైనట్టు, అపచారమయినట్టు మాట్లాడుతున్నాడు. ఇది అతను నిజంగా నమ్ముతాడని కాదు. తనకే అవసరం ఏర్పడితే నక్సలైట్లతో ఏమొచ్చె, నిజంగానే అసాంఘిక శక్తులైన వారితోనూ చేతులు కలుపుతాడు. అయితే హింసను నమ్ముకున్న వారిగా గుర్తింపు పొందిన నక్సలైట్లతో సఖ్యత మర్యాదస్తులకు తగదన్న రాజకీయ అభిప్రాయానికి చలామణి వుంది కాబట్టి - దానిని ముఖాముఖీ ఎదుర్కొని తిప్పి కొట్టడం కాంగ్రెస్ వారికి అసాధ్యం కాబట్టి - ఆ బూచిని చంద్రబాబు ప్రయోగిస్తున్నాడు.

అయితే పైన చెప్పినట్టు, ఆ దెబ్బతో అతను కాంగ్రెస్ వారిని కొంచెం ఇరకాటంలో పెట్టి ఉండవచ్చును గానీ అది అతని చాతుర్యం కన్నా బలహీనతనే సూచిస్తుంది. ఇప్పటికి వందరోజులుగా సాగుతున్న విద్యుత్ చార్జీల పెంపుదల వ్యతిరేక ఉద్యమం లేవదీస్తున్న ఏ ఒక్క ప్రశ్నకూ చంద్రబాబు దగ్గర జవాబు లేదు. ఇది ఎంత స్పష్టంగా ఉందంటే అతని

మద్దతుదారులు సైతం - పేర్లు చెప్పకోవడం అనవసరం - విమర్శకులుగా ముందుకొచ్చి తమ పరువు కాపాడుకుంటున్నారు.

ఏ జవాబూ లేని ముఖ్యమంత్రికి ఈ నింద అక్కరకొచ్చింది. మామూలుగానే అభ్యర్ధన కూడ బెదిరింపు లాగా ధ్వనించే అతని గొంతులో ఈ నింద చాలా అభ్యంతరకరంగా ధ్వనించడంలో ఆశ్చర్యం లేదు. ఆ ఊపులో ఎక్కడ ఆగాలో కూడ తెలియకుండా మొన్నటి పోలీసు కాల్పుల్లో చనిపోయిన ఒక వ్యక్తి గురించి 'అతను రౌడీ షీటర్, గూండా' అంటూ అసెంబ్లీలోనే నిందలు వేశాడు. చట్టసభలలో రాజకీయ నాయకుల వ్యవహారశైలి దిగజారుతున్నదని కొంతకాలంగా అందరం అంటూనే ఉన్నాము గానీ పోలీసు కాల్పులలో పౌరులు చనిపోవడం పట్ల కనీస చింత అయినా వ్యక్తం చేయకుండా చనిపోయిన వాళ్ళను 'రౌడీలు', 'గూండాలు', 'తీవ్రవాదులు' అంటూ అసెంబ్లీలో రాష్ట్ర ముఖ్యమంత్రి మాట్లాడడం వట్టి దిగజారుడు కాదు; దానికి ఇంకేదైనా పేరు పెట్టవలసి ఉంది.

మొత్తంగా విద్యుత్ రేట్ల విషయంలో ప్రదర్శిస్తున్న మూర్ఖమైన వైఖరిని చంద్రబాబు పోలీసు కాల్పుల విషయంలోనూ కొనసాగిస్తున్నాడు. కనీసం న్యాయవిచారణ జరిపించాలన్న ప్రతిపక్షాల, ప్రజాసంఘాల డిమాండును అంత మొండిగా ఎందుకు తిరస్కరించాలి? ఆందోళనకారులే పోలీసులపై మొదట రాళ్ళు వేసి రెచ్చగొట్టారని అంటున్నాడు. అదే నిజమైతే న్యాయవిచారణలో ఆ సంగతే రుజువవుతుంది కదా! కాల్పులపైన న్యాయవిచారణ అంటే కాల్పులు జరిగిన వైనం, దాని పూర్వాపరాల పైన విచారణ అనే కదా ఎప్పుడయినా అర్ధం?

అభ్యంతరం ఉండనవసరం లేని విషయాలలో కూడ మొండిగా వుండడం బలాన్ని కాదు, బలహీనతను సూచిస్తుంది. ప్రపంచ బ్యాంకు నమూనా సంస్కరణలు అమలు చేస్తే ప్రజాదరణ కోల్పోవలసి వస్తుందేమోనని అన్ని పార్టీల నాయకులూ భయపడుతున్న తరుణంలో 'నేను అమలు చేసి చూపిస్తా'నంటూ చంద్రబాబు బయలుదేరాడు. మొదటి నాలుగైదడుగులు ప్రజలలో వ్యతిరేకతను ఎదుర్కోకుండానే చేశాడు. ఎన్నికలలోనూ గట్టెక్కాడు. కరువుకు తట్టుకుని నీటి రక్షణ గురించి జనాన్ని ఊదరగొట్టి, ఏదో చేస్తున్నాడన్న అభిప్రాయం చాలామందిలో కల్పించగలిగాడు.

కానీ విద్యుత్తు విషయంలో మొట్టమొదటిగా గట్టి వ్యతిరేకతను ఎదుర్కొంటున్నాడు. ఇది ఒకటి రెండు నెలలలో సమసిపోయే ఆందోళన కాదు. ఎందుకంటే ప్రపంచబ్యాంకు ఆమోదముద్ర వేసిన విద్యుత్ పునర్వ్యవస్థీకరణ ప్రణాళిక ప్రకారం, రాబోయే ఏడు సంవత్సరాలు - అంటే 2007 దాకా ప్రతీ సంవత్సరం కరెంటు చార్జీలు 12 శాతం చొప్పున పెరుగుతాయి. 2007 తరువాత పెరగవా అంటే ఈ ప్రణాళిక

ప్రకారం అప్పటికి కరెంటు ఉత్పత్తి, సరఫరా, పంపిణీలకయ్యే ఖర్చు మొత్తం వినియోగదారులు చెల్లించే స్థితి వచ్చేస్తుంది కాబట్టి ఆ తరువాత పనిగట్టుకొని పెంచనవసరం లేకుండా ఖర్చు పెరిగినప్పుడల్లా చార్జీలు పెరుగుతూనే ఉంటాయి.

ఇవన్నీ ఎవరికి తెలియకపోయినా చంద్రబాబుకు తెలుసును. అందువల్లే ఈ ఆందోళనను ప్రజలు కొన్నాళ్ళకు అలసిపోయి విరమించుకొని, ఆ తరువాత మరచిపోయి ఊరుకోవడం జరగదని కూడ అతనికి తెలుసును. అయితే దీని నెదుర్కోవడానికి అతని దగ్గర ఎత్తుగడలేవీ లేవు కాబట్టే ఇంత ఉక్రోషం ప్రదర్శిస్తున్నాడు.

నీహార్ ఆన్లైన్.కాం

31.08.2000